క్లుప్తంగా

వరి దిగుబడి, ధర భేష్



శిరివెళ్ల వద్ద వరి ధాన్యంను అమ్మడానికి బస్తాల్లో నింపిన దృశ్యం

శిరివెళ్ల: మండలంలో రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కేసీ కెనాల్ కింద 6 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. తెలుగు గంగ, బోర్లు, బావుల కింద మరో వెయ్యి ఎకరాలు సాగైంది. కోటపాడు, కామినేనిపల్లె, గోవిందపల్లె, శిరివెళ్ల, వెంకటాపురంలో ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. కాగా ఖరీఫ్‌లో మాదిరిగానే దిగుబడి, ధర బాగుండటంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుండటం, ధర 75 కేజీల బస్తా రూ. 1500ల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. మొత్తం మీద ఈ ఏడాది వ్యవసాయం రైతన్నకు కలిసొచ్చింది.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలో సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గిరిన్నాథ్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆసుపత్రి ఎండీ మారుతిరావు పర్యవేక్షణలో జనరల్ ఫిజీషియన్ బోరెడ్డి శ్రీకాంతరెడ్డి, కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 15వ వార్డు ఇన్‌చార్జ్ సాయిరాంరెడ్డి, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, వైఎస్‌రెడ్డి, విశ్వనగర్ రాము, గిరిబాబు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: చాగలమర్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మేధ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వైస్సార్‌సీపీ నాయకులు బాబూలాల్, కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య నిపునులు లక్ష్మీధరణీధర్ రెడ్డి, నాగయ్య దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



రుద్రవరంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని అమర్చుతున్న దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రంలో దెబ్బతిన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి ఆదివారం కొత్త వాటిని అమర్చినట్లు ఏఈ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సమయంలో గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు ప్రస్తావించడంతో ఆయన ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు స్తంభాలు మంజూరు చేశారని చెప్పారు. దెబ్బతిని కూలే దశలో ఉన్నవాటిని తొలగించి మొత్తం 44 స్తంభాలను మార్చామని వివరించారు.

ఘనంగా కుందమాల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ శ్రీదేవి రచించిన కుందమాల పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామేశ్వరరెడ్డి హాజరై పుస్తకావిష్కరణ గావించారు. రచయిత శ్రీదేవి మాట్లాడుతూ.. తన పుస్తకాన్ని డాక్టర్ రామేశ్వరరెడ్డికి అంకితం చేశానని చెప్పారు. ఈ పుస్తకంలో రామాయణంలో సీతను రథంపై తీసుకెళ్తున్న సమయంలో లక్ష్మణుడి మనోవేదన చక్కగా ఆవిష్కరించానన్నారు. కుందమాల అనగా ఉత్తమ రామాయణమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, సహదేవుడు, లక్ష్మీసరస్వతి, డాక్టర్ డీవీ హయగ్రీవాచారి, అన్నెం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞత దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): జమాతే ఇస్లామి హింద్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సంఘం కార్యాలయంలో కృతజ్ఞత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. షేక్ అబ్దుల్ సమ్మద్ మాట్లాడుతూ సంఘం 1947 ఏప్రిల్ 16న ఆవిర్భవించిందని, దేశ వ్యాప్తంగా ప్రజలకు వ్యక్తిగతంగా, ధార్మికంగా సమాజానికి బాధ్యతాయుతంగా దిశ, నిర్దేశం చేస్తుందన్నారు. మున్సి అబ్దుల్ రహింఖాన్, సయ్యద్ యూసుఫ్, అబ్దుల్‌ఖాదర్, సాలార్‌ఖాన్, సలీం పాల్గొన్నారు.

రైతన్నా..త్వరపడు

వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా సాగు అవసరాలకు వినియోగించుకునేందుకు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తుంది. దీంతో ఏటా రూ.13,500 అందజేస్తుంది. అయితే అర్హత కలిగి.. పథకం వర్తించని వారుంటే నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు సంబంధిత ధ్రువ పత్రాలతో ఆర్బీకేల్లో సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది.

- అర్హత ఉండి వైఎస్సార్ రైతు భరోసా -పీఎం కిసాన్ అందని రైతులకు అవకాశం
- నెలాఖరు వరకు దరఖాస్తుకు గడువు
- నియోజకవర్గంలో లబ్ధిదారుల సంఖ్య 45,955



భాగ్యనగరం వద్ద మినుము పంటలో అంతరసేద్యం చేస్తున్న అన్నదాతలు

దొర్నిపాడు: సాగు ఖర్చులు ఏటేటా పెరిగిపోతుండటంతో రైతులు సాగుకు వెనకడుగు వేసే పరిస్థితి నెలకొనడంతో వారికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ రకాల పథకాలు, సబ్సిడీలు, సేవలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కర్షకులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి సంవత్సరం రైతులకు వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ ద్వారా రూ.13,500 పెట్టుబడి సాయంగా మూడు విడతల్లో అందిస్తుంది. ఇప్పటికే నాలుగు విడతలుగా సొమ్ము అందజేసింది. అయితే ఇప్పటికీ కొందరు అర్హత కలిగిన రైతులకు వివిధ కారణాలు, సాంకేతిక సమస్యలతో పథకం వర్తించడంలేదు. అర్హులందరికీ అందజేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. వారందరికీ వర్తించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పురమాయించింది. దీంతో ఈ నెలాఖరు లోపు అన్ని అర్హతలుండి పెట్టుబడి సాయం అందనివారు తమ గ్రామ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

అర్హులకు అవకాశం..

వైఎస్సార్ రైతు భరోసా పథకానికి ప్రభుత్వం ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చింది. భూ యాజమాని మరణించి ఉంటే నామిని దరఖాస్తు చేసుకునేందుకు, అలాగే నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసుపుస్తకం, నకళ్లతో పాటు ఫోన్ నంబర్‌తో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలి. రేషన్ కార్డును యూనిట్‌గా తీసుకొని కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తింపజేస్తారు. లబ్ధిపొందుతున్న వారు మృతి చెందితే మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాలి. పొలం కల్గిన భార్య, భర్తలు చనిపోతే ఆ పొలానికి కుటుంబీకుల్లో ఎవరో ఒకరి ఆధార్ నంబర్‌ను తహసీల్దార్‌ను కలిసి అనుసంధానించుకోవాలి.

- అలాగే పీఎం కిసాన్ పథకానికి ఆన్‌లైన్ ద్వారా

మండలాల వారీగా వైఎస్సార్ రైతు భరోసా పథకం లబ్ధిదారులు..

మండలం	రైతుల సంఖ్య	నాల్గవ విడతలో రైతులకు అందిన సొమ్ము
ఆళ్లగడ్డ	9,977	2,06,26,000
చాగలమర్రి	7,147	1,52,55,000
దొర్నిపాడు	4,564	1,01,99,500
రుద్రవరం	9,541	2,11,80,500
శిరివెళ్ల	8,825	1,88,08,000
ఉయ్యాలవాడ	5,901	1,25,56,500
మొత్తం	45,955	9,86,25,500

దరఖాస్తు చేసుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లోని వీపీఏలు, మీసేవ, సీఎస్‌సీ కేంద్రాల్లో, రైతులు నేరుగా ఆన్‌లైన్‌లో తగిన ధ్రువ పత్రాలు జతచేసి



చాకరాజువేముల గ్రామ ఆర్బీకేలో అధికారులను సంప్రదించిన రైతులు

దరఖాస్తు చేసుకుంటే మండల వ్యవసాయాధికారి లాగిన్‌కు చేరుతుంది. వెంటనే సంబంధిత రైతులకు అధికారులు సమాచారం ఇవ్వగానే బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం లేదా ఆర్ఓఆర్‌ను అందజేయాలి. పీఎం కిసాన్ పొందాలంటే తప్పని సరిగా రైతు పేరిట పొలం ఆన్‌లైన్‌లో ఉండాలి. వైఎస్సార్ రైతు భరోసాకు మాత్రం యజమాని చనిపోతే నామిని అయిన భార్యకు ఇస్తారు.

వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ ఇలా..

- మొదటి విడత పంట వేసేముందు మే నెలలో రూ.7,500
- రెండో విడత రబీ అవసరాల కోసం అక్టోబర్ నెలలో రూ.4000
- మూడో విడత ధాన్యం ఇంటికి చేరే వేళ, రైతులకు సంక్రాంతి సందర్భంగా జనవరిలో రూ.2,000

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అర్హత ఉండి వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు అందని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో వీపీఏలను సంప్రదిస్తే మీ ధ్రువ పత్రాలను చూసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అలాగే పీఎం కిసాన్ రాని వారు కూడా ఆన్‌లైన్‌లో రైతులే స్వతహాగా దరఖాస్తు చేసుకోవచ్చు. అవకాశం లేని వారు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించవచ్చు. కేవలం రెండు వారాలు మాత్రమే గడువు ఉన్నందున రైతులు అవకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీకృష్ణ, మండల వ్యవసాయాధికారి, దొర్నిపాడు

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మను భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిత్య, విశేష పూజల అనంతరం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో అలంకించి వెకువజామునుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు బోనాలు, చీరలు, పాలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపల్ ఆస్తులను పరిరక్షిస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(సిటీ): పట్టణంలోని మున్సిపల్ ఆస్తులను పరిరక్షిస్తామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా స్థానిక రైతు బజార్ వద్ద మున్సిపల్ స్థలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. ఆ స్థలాన్ని వివాదాస్పదమైనదిగా కొందరు చిత్రీకరిస్తున్నారన్నారు. ఈ స్థలం గతంలో మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్‌గా వచ్చిందని, దానిపై పూర్తి హక్కులు మున్సిపాలిటీకే చెందుతాయని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ స్థలంలో పార్కు, చిన్నారులు ఆడుకోవడానికి ఆట పరికరాలు, పాదాచారులకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి మున్సిపల్ కౌన్సిల్ ద్వారా అనుమతులు లభించడంతో కాంట్రాక్టర్ పనులు చేస్తున్నారన్నారు. ఈ స్థలంపై వివాదం తగదని ఎటువంటి అనుమానాలు ఉన్నా మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆధారాలను పరిశీలించవచ్చని తెలిపారు. అంతే కాకుండా ఇది వరకే కోర్టులో పిటిషన్ నెంబర్ 15412లో మున్సిపల్ కార్యాలయానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

షేక్షావలి రెడ్డికి చాత్రాలయ పురస్కారం



సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ నుంచి అవార్డు అందుకుంటున్న షేక్షావలి రెడ్డి

నంద్యాల(సిటీ): సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీ.వీ.రామన్ సైన్స్ ఒలంపియాడ్ అసోసియేషన్ వారు నిర్వహించిన జాతీయ, రాష్ట్రస్థాయిలో మ్యాథ్స్, సైన్స్ రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దిన పలువురికి పురస్కారాలు అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో నంద్యాలకు చెందిన గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డికి సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ పురస్కారం అందజేశారు. 22 సంవత్సరాలుగా విద్యారంగంలో విద్యార్థులకు అమితమైన సేవలు అందిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తనదైన కృషి చేసినందున పురస్కారం అందజేశారని షేక్షావలి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ లయన్ కిరణ్‌కుమార్, సినీ నటుడు అడవి శేషు ఉన్నారు.

ఇఫ్తార్‌తో సోదరభావం



కొత్త మసీదులో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందు, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్త మసీదులో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల విజయసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, నజీర్, అమీర్ ఉన్నారు.

'బీజేపీని గద్దె దింపుదాం'



పాదయాత్రగా వెళ్తున్న వామపక్ష పార్టీల నాయకులు

నంద్యాల(అర్బన్): కేంద్రంలో బీజేపీని గద్దె దింపుదామని వామపక్ష పార్టీల నాయకులు ప్రసాద్, పుల్లా నరసింహులు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర, ఆదివారం సాయిబాబానగర్, దేవనగర్, వీసీ కాలనీ ప్రాంతాల్లో సాగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీపరం చేస్తూ ప్రజలపై భారం మోపుతున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ చర్యలను ప్రతి ఒక్కరూ ఎండ గట్టాలన్నారు. నాయకులు తోటమద్దులు, సోమన్న, ధనుంజయ్, లక్ష్మణ్, శ్రీనివాసులు, వెంకటలింగం, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కబ్జాలపై మీరు మాట్లాడటమా?

- మీ గురించి ప్రజలకు బాగా తెలుసు
- మున్సిపల్ స్థలంలో పార్కు నిర్మిస్తే ఇబ్బందేమిటి?
- వార్డు మెంబర్ కాని వ్యక్తి కూడా ఎమ్మెల్యేను విమర్శించడమేనా..
- మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టి శ్రీధర్ ధ్వజం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి

నంద్యాల: కబ్జాలను ఎవరు ప్రవృత్తిగా మార్చుకున్నారో ప్రజలకు బాగా తెలుసునని, వారు కూడా కబ్జాల గురించి నీతులు చెప్పడం చూస్తే.. దెయ్యాలు నీతులు వల్లించినట్లుగా ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టి శ్రీధర్ మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు బజార్ వద్ద ఉన్న స్థలం మున్సిపాలిటీదని, ఆ స్థలంలో పార్కింగ్, వాకింగ్ ట్రాక్, స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మిస్తే కబ్జా ఎలా అవుతుందని ప్రశ్నించారు. పట్టణంలో మున్సిపల్ ఆస్తులను ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కానివ్వమని పేర్కొన్నారు. మున్సిపల్ స్థలం ఖాళీగా ఉండటంతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారని, అందులో పార్కు నిర్మించాలనుకోవడం తప్పు ఎలా అవుతుందని నిలదీశారు. హైకోర్టు కూడా ఆ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే పార్కు వంటివి కట్టుకోవచ్చని స్పష్టంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. కొందరు టీడీపీ నాయకులు పట్టణంలో స్థలాలు కబ్జా చేస్తూ.. వారే మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే శిల్పారవి కబ్జా చేస్తున్నారని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వారి కుటుంబం సేవకు మాత్రమే పమితమైందన్నారు. వార్డు మెంబర్, సర్పంచ్ కాని వ్యక్తులు కూడా ఎమ్మెల్యేను విమర్శించడమేనా.. విమర్శించేటప్పుడు అర్హత తెలుసుకోవాలని, వాస్తవాలు తెలియకుండా అవివేకంతో మాట్లాడొద్దని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీపై అప్రమత్తంగా ఉండాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆళ్లగడ్డ: గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి తెలిపారు. అగ్రిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక పావన అపార్ట్‌మెంట్‌లో ఆదివారం గ్యాస్ ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు వ్యవహరించాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ వాడకం పూర్తయిన తరువాత రెగ్యులేటర్ వాల్వును ఆపి వేయాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల గ్యాస్ ట్యూబ్‌లను వాడాలని చెప్పారు. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్‌లతో పాటు అదనపు గ్యాస్ సిలిండర్ ఉంచడం ప్రమాదకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

98 క్వాలిఫైడ్స్ అభ్యర్థులందరికీ న్యాయం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

నంద్యాల(అర్బన్): 98 క్వాలిఫైడ్స్‌లో ఉద్యోగాలు రాని అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి న్యాయం చేస్తారనే నమ్మకం తమకు ఉందని, ఎస్సీ,ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. క్వాలిఫైడ్ల ఎంపికలో రిజర్వేషన్లను అమలు చేయకపోవడం అన్యాయమని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన 98డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల ఉపాధ్యాయ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నాయకులు రాజు, శ్రీనివాసులు, దేవేంద్రుడు, లక్కా భాస్కర్, హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పాణ్యం: బీసీ రెసిడెన్సియల్ బాల, బాలికల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ బాలికల పాఠశాలలో 504 మంది గాను 427మంది పరీక్ష రాశారు. బీసీ వెల్ఫేర్ సెక్రటరీ కృష్ణమోహన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

గడివేముల: మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఆకటుకుంది. హెచ్ఎం శ్రీనివాసులు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు పలు నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. ముఖ్యంగా దేశనాయకులు, రాజకీయ, భౌతిక పటాలు, వర్షమాపకం, వర్షపునీటిని నిల్వ చేయడం, ఫస్ట్ ఎయిడ్‌బాక్స్, మట్టిపొరలు, వాతావరణ కాలుష్యం, పేదవాడి ఫ్రిజ్, జాతీయ చిహ్నాల గురించి విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని హెచ్ఎం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తగిరమ్మ, నాగన్న, కళ్యాణ్, హేమేంద్ర, లక్ష్మణకుమార్, ఖాదర్‌బాషా, నూరుల్లా, రెహా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామానికి చెందిన బాలరాజు భార్యాపిల్లలతో కలిసి చాగలమర్రి మండలం వనిపెంటలో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. పట్టణ శివారులోని పేరా బిల్డింగ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజుతోపాటు కుమారులు విజయతేజ, అనురాగ్ గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది క్షతగాత్రులను కోవెలకుంట్ల ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నా, షేక్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కాపక్కా లేదు!

- తంగడంచ ఫారంభూముల విస్తీర్ణంపై స్పష్టత కరువు
- టీడీపీ పాలనలో స్పష్టతలేని జీఓలతో భూముల పంపిణీ
- ఉన్న దాని కంటే అధికంగా కేటాయింపు

జూపాడుబంగ్లా: టీడీపీ పాలనలో తిమ్మిని బమ్మిని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నానని కంపెనీలను స్థాపించి ప్రజలకు ఉద్యోగ, ఉపాధిని మెరుగుపరుస్తున్నానని నమ్మించి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బురిడీ కొట్టించారు. తంగడంచ ఫారం భూముల్లో మెగాఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మెగాసీడ్ పార్కులను స్థాపిస్తున్నానని పేర్కొంటూ ఒకే స్థలాన్ని రెండు కంపెనీలకు ఇస్తున్నట్లు రెండు వేర్వేరు జీవోలు జారీచేశారు. ఈ నేపథ్యంలో తంగడంచ స్టేట్‌సీడ్ ఫారం భూముల పూర్తి విస్తీర్ణంపై నేటికీ అధికారుల వద్ద స్పష్టమైన లెక్కలు లేకపోవటం గమనార్హం.

పొంతన లేని లెక్కలు

తంగడంచ ఫారం పూర్తి విస్తీర్ణం 1616 ఎకరాలు (ఫారం అధికారుల లెక్కల ప్రకారం), స్టేట్ సెక్రెటరేట్‌లో ఉన్న లెక్కల ప్రకారం (తంగడంచ రెవెన్యూ పరిధిలో 845.73 ఎకరాలు, 35 బొల్లవరం రెవెన్యూ పరిధిలో 758.24 ఎకరాలు) 1603.97 ఎకరాల భూములున్నాయి. ఇందులోని సర్వేనెంబరు 363/1 నుంచి 369 సర్వేనెంబర్ల వరకు తంగడంచ రెవెన్యూ పరిధిలో ఉన్న 623.40 ఎకరాల భూమిని జైన్‌ఇరిగేషన్ కంపెనీకి కేటాయిస్తున్నట్లు 2015 నవంబరు 12వ తేదీన టీడీపీ ప్రభుత్వం జీఓ నెంబరు 1118 ను విడుదల చేసి 2017 జూన్ 21న సీఎం జైన్ ఇరిగేషన్ కంపెనీని ప్రారంభించారు. 2017 అక్టోబర్ 5న తంగడంచ రెవెన్యూ పరిధిలో ఉన్న 363/1 నుంచి 369 సర్వేనెంబర్ల వరకు ఉన్న 623.40 ఎకరాల భూమిని మెగాసీడ్ పార్కుకు కేటాయిస్తున్నట్లు జీవో నెంబరు: 77ను విడుదలచేసి అదేరోజున మెగాసీడ్‌పార్కు నిర్మాణానికి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారు. వీటితోపాటు ఆచార్య ఎన్‌జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 499.81 ఎకరాల భూమిని కేటాయిస్తూ జీఓను జారీచేశారు.

భూమి తక్కువ పంపకాలెక్కువ

తంగడంచ ఫారం పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 1603.95ఎకరాల భూములన్నాయి. కేసీ కాల్వ 117.49 ఎకరాలు, భవనాలు, రోడ్లకు 50.00ఎకరాలు, రైతులకు ఇచ్చిన డీఫారం పట్టాలు 73.83 ఎకరాలు పోను మిగిలేది 1362.63ఎకరాలు. అందులో జైన్ ఇరిగేషన్ కంపెనీకి 623.40ఎకరాలు, అంబుజాకు 211 ఎకరాలు (ప్రస్తుతం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఆధీనంలో ఉంది). ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విత్తనోత్పత్తి, పరిశోధన కేంద్రానికి 499.81 ఎకరాలు కేటాయిస్తూ జీవోను విడుదల చేశారు. నికరంగా 28.42ఎకరాల భూమి మిగులుతుంది. అయితే ప్రజలను బురిడి కొట్టించటానికి అప్పట్లో చంద్రబాబునాయుడు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రాజశేఖర్ ఫారంలో లేని 623 ఎకరాల భూములను సీడ్‌హబ్‌కు కేటాయిస్తూ జీవోలు జారీచేశారు. ఈ విషయమై అప్పట్లో ప్రధానకార్యదర్శి రాజశేఖర్‌తో ప్రస్తావించగా మనప్రభుత్వమే కదా భూములను సర్దుకుందామని పేర్కొనటం జరిగింది. కాగా ఆచార్య ఎన్‌జీ రంగాకు కేటాయించిన భూములను వెనక్కి తీసుకొని సీడ్‌హబ్‌కు కేటాయిస్తున్నామని పేర్కొనటంతో ఆచార్య ఎన్‌జీరంగా పరిశోధన కేంద్రం తిరిగి నంద్యాలకు వెళ్లింది. ప్రస్తుతం ఈ భూములు తంగడంచ ఫారం అధికారుల ఆధీనంలో ఉన్నాయి.



ప్రస్తుతం ముళ్లపాదలతో నిండిపోయిన తంగడంచ ఫారం భూమి

ప్రస్తుతం బీడుగా ఉన్న సీడ్‌హబ్ భూములు

టీడీపీ పాలనలో సీడ్‌హబ్‌కు కేటాయించిన భూములు ప్రస్తుతం బీడుగా ఉన్నాయి. తంగడంచ ఫారం అధికారులు వాటిలోని ముళ్లపాదలను తొలగించి ప్రస్తుతం 150ఎకరాల భూములను సాగులోకి తెచ్చారు.

ఫారం భూముల పూర్తి వివరాలు తెలియవు

నేను తంగడంచ ఫారం ఇన్‌చార్జ్ ఏడీఏ గా విధులు నిర్వహిస్తున్నాను. నాకు ఫారం భూముల పూర్తి విస్తీర్ణం వివరాలు తెలియవు. టీడీపీ పాలనలో ఇచ్చిన జీవోల వివరాలు తెలియవు. ప్రస్తుతం ఖరీఫ్,రబీ సీజన్‌లలో సుమారు 200ఎకరాల మేర ఫారం భూములను సాగుచేసి పంటలు వేస్తున్నాం. బీడుగా ఉన్న భూముల్లో జంగిల్ క్లియరెన్స్ చేసి పంటల సాగుకు అనుమతులు ఇవ్వాలని కమిషనరేట్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకా అనుమతులు మంజూరు కాలేదు.

–విజయశేఖర్, ఇన్‌చార్జ్ ఫారం ఏడీఏ